# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల

### మొదటి భాగం..

*డియర్ రీడర్స్*

*మిసెస్ పరాంకుశం నవల గురించి మీతో కొన్ని విషయాలని పంచుకోవాలని ఇది రాస్తున్నాను.*

*ప్రేరణ*

*మిసెస్ పరాంకుశం నవలకి ప్రేరణ మా ఇంటి వెనక ఉన్న ఓ వేశ్యా వాటిక. నా బాల్యంలో గాంధి నగర్‌లో అలాంటిది ఒకటి ఉండేది. దాన్ని 'కంపెని' అనేవారు. మా ఇంటి వెనక సందులో ఉన్న దానిపేరు 'అన్నపూర్ణ కంపెని.' అంటే అన్నపూర్ణ అనే ఆవిడ దాన్ని నడిపేది.*

*మొదట్లో మేము కింద ఉండేవాళ్ళం కాబట్టి ఇంటి వెనక ఉన్న ఖాళీ స్థలం గుమ్మం తలుపు తెరిస్తేనే, అవతలి రోడ్డు మీద ఎదురుగా ఉన్న అన్నపూర్ణ కంపెని కనపడేది. నా ఫోర్త్‌ఫారంలో మా నాన్నగారు మేడ వేయడంతో మేం పైకి మారి కింది పోర్షన్‌ని అద్దెకిచ్చాం. మేడ మీది వెనక బాల్కనీ లోంచి, పాకలో ఉండే ఆ కంపెనీ కనపడేది. అప్పట్లో అదేమిటో నాకు తెలియదు.*

*తరచు కొత్త పిల్లలని వేటాడి తెచ్చేవారు. వ్యభిచారంలోకి దిగడానికి ఇష్టపడని వారిని ఒప్పించడానికి రకరకాలుగా హింసించేవారు. అలాంటి ఆడపిల్లల ఆర్తనాదాలు మాకు వినిపించేవి. వారి దైన్య స్థితికి నా మనసు ఆక్రోశించేది. 'శిక్షణ' ముగిసాక వాళ్ళని తెనాలి, గుంటూరు లాంటి ఊళ్ళలోని ఇలాంటి కంపెనీలకి పంపేసేవారు.*

*ఆ రోజుల్లో నేను విన్న అనేక ఆర్తనాదాల వల్ల నాలో కలిగిన ఆవేదనే ఈ నవలకి ప్రేరణ. అలా వచ్చిన పిల్లల్లో ఓ అమ్మాయి పేరు సౌదామిని. ఎక్కడ్నించి ఎత్తుకు వచ్చారో కాని, నల్లగా ఉన్నా చాలా అందంగా, కళగా ఉండేది. నా పదిహేడో ఏట ఈ నవలకి సినాప్సిస్‌ని రాసుకున్నాను. చదువయ్యాక రచనలు చేసే ఉద్దేశ్యంతో అలా చాలా కథలకి సినాప్సిస్‌లు రాసుకునేవాడిని. ప్రభలో వచ్చిన నా మొదటి కథ 'అబల' అప్పుడు రాసుకుందే*

*వెంకటేశ్వరరావు అనే స్థానిక పోలీసు ఆ కంపెనీకి రక్షణగా ఉండేవాడు. పోలీస్ రెయిడ్ గురించి ముందే వాళ్ళని హెచ్చరించేవాడు. పోలీసులు వచ్చినప్పుడు వాళ్ళంతా పక్కింట్లోకి వెళ్ళి దాక్కునేవారు. ఆ విధంగా రెయిడ్‌లో ఎవరూ పట్టుబడేవారు కారు. అమ్మాయిల కోసం విటులు కిళ్ళీ షాపుల్లోని సోడా బుడ్లని రోడ్డు మీదకి విసురుకుని పోట్లాడుకునేవారు. 1971 కల్లా అన్నపూర్ణ కంపెనిని ఎత్తేసి, పాకని కూల్చేసి అక్కడ ఓ బిల్డింగ్‌ని కట్టారు. చాలా కాలం అక్కడ సిండికేట్ బేంక్ ఉండేది.*

డిగ్రీ పూర్తయి నేను హైదరాబాద్‌కి ఉద్యోగ రీత్యా వచ్చాక నేను రాసుకున్న సినాప్సిస్ మిస్ అయింది. జ్ఞాపకాల్లోంచి దీన్ని రాసి ప్రభకి పంపాను. కొద్ది వారాల్లో ఇది ప్రభలో సీరియల్‌గా మొదలవగానే , అప్పటికి నేను బ్రహ్మచారిని కాబట్టి, దీన్ని చదివిన మా అమ్మ నాన్నలకి నేను అలాంటి పని చేస్తానేమోననే భయం పట్టుకుంది. ఈ నవల వెలువడ్డాక పిలిపించి నా పెళ్ళి గురించి మాట్లాడారు. నవల వేరు, జీవితం వేరు అని, నేనా పని చేయనని మా అమ్మకి చెపితే కాని ఆవిడ భయం పోలేదు. ఈ అభిప్రాయాన్నే ఈ నవలలో అమ్మాజీ పాత్ర ఓ కార్డు మీద రాసి పరాంకుశానికి పంపుతుంది.

నిజానికి ఈ నవలకి ముందు అనుకున్న పేర్లయిన 'ముందంజ' లేదా 'ముందడుగు'లలో ఓ పేరుతో వచ్చి ఉండేది. కాని నాకు ఆ పేర్లు చప్పగా ఉన్నాయని అనిపించాయి. దీన్ని ప్రభకి పంపడానికి మూడు రోజులు ముందు సౌదామిని అనే పేరు బాగుంటుందని అనిపించింది. కాని పరాంకుశం పేరు కూడా కలపాలన్న సంకల్పంతో రెండు పేర్లు కలిసి వచ్చే 'మిసెస్ పరాంకుశం' తట్టడంతో దీనికి అదే పేరు పెట్టి పంపాను.

<u>పుస్తక రూపం</u>

మిసెస్ పరాంకుశం 1971 లో ఆంధ్రప్రభ వార పత్రికలో సీరియల్‌గా వెలువడింది. తొమ్మిది వారాల పాటు అని గుర్తు. మొదటగా నాటి ఎమెస్కో అధినేత శ్రీ యం. ఎన్. రావు పుస్తకరూపంలో, 'అద్దెకిచ్చిన హృదయాలు' అనే మరో పెద్ద కథతో కలిపి దీన్ని ప్రచురించారు. అది దీని కన్నా కొద్దివారాల ముందు ప్రభలోనే సీరియల్‌గా ఐదు వారాల పాటు వెలువడింది.

మరో సంగతి కూడ ఇక్కడ గుర్తు చేసుకోవచ్చు. ఎమెస్కో వారు రెండు నవలలకి రెండు కాంట్రాక్ట్ ఫారాలు మీద ఒకే పుస్తకంలో వేసారు. దాంతో ఆ పుస్తకానికి పారితోషకం ఇచ్చారు. 'నాకు రెండు నవలలకి రెండు పారితోషికాలు రావాలి కదా?' అని వెళ్ళి అడిగాను పుస్తకం ధరని బట్టి పారితోషికం పారితోషికం చెల్లిస్తామని, రెండు నవలలు రెండు పుస్తకాలు అవుతాయన్న దృష్టితో రెండు కాంట్రాక్ట్ ఫారాలని ఇచ్చామని ఎం. ఎన్ రావుగారు వివరించారు. ఆ విధంగా నేను వారిని చూడటం తటస్థించింది. నాలోని అసంతృప్తిని గమనించి ఇంకో నవల రాసి తెస్తే ఇంకో పారితోషికం ఇస్తామన్నారు. ఆ స్ఫూర్తితో నేను రాసిన 'లావణ్య' అనే నవలని ఎక్కడా సీరియల్ గా రాకుండానే పుస్తకంగా ప్రచురించారు.

తర్వాత డీలక్స్ పబ్లికేషన్స్, విజయవాడ వారు 1981 లో దీన్ని పుస్తకంగా ప్రచురించారు. ఆ తర్వాత శ్రీ మహాలక్ష్మీ బుక్ ఎంటర్ ప్రైజెస్, విజయవాడ వారు కూడా దీన్ని పుస్తకంగా 1984 లో అచ్చు వేసారు. అప్పటినుంచి ఇంతదాకా ఇది మళ్ళీ పుస్తక రూపంలో రాలేదు. ఇరవై అయిదేళ్ళ తర్వాత తిరిగి ఇది మీ చేతుల్లోకి పుస్తకంగా వస్తోంది.

దీన్ని ప్రూఫ్ దిద్దుతుంటే ఆ రోజుల్లో దీన్ని వాక్య నిర్మాణ విషయంలో ఎంత పేలవంగా రాసానా అనిపించింది. దాదాపు ప్రతీ వాక్యాన్నీ మార్చాల్సి వచ్చింది. తీసుకున్న విషయంలో గాంభీర్యం ఉంది కాబట్టి ఇది ఇంకా చాలామందికి గుర్తుండిపోయింది కాని, రచనా చాతుర్యం వల్ల కాదు అని ప్రూఫ్‌లు దిద్దిన నాకు విశదమైంది.

అప్పట్లో నా వాక్య నిర్మాణంలో వెర్బ్ ముందు రాసేవాడిని. 'కూర్చున్నాడు పరాంకుశం సౌదామిని వంక చూస్తూ, ఓ చేతిలో పాల బాటిల్‌ని పట్టుకుని.' ఇలా ఉండేది.

ఇప్పుడు ఇలా రాస్తున్నాను. 'ఓ చేతిలో పాల బాటిల్ పట్టుకున్న పరాంకుశం సౌదామిని వంక చూస్తూ కూర్చున్నాడు.'

నవలలోని ఓ వాక్యం ఉదాహరణగా ఇస్తున్నాను.

ఈ ఎనిమిది నెలలూ ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు పరాంకుశం బావకి అన్ని సంగతులూ.

దాన్ని నేను ఇలా మార్చాను.

పరాంకుశం తన బావకి ఈ ఎనిమిది నెలల సంగతులన్నీ ఉత్తరాల్లో రాస్తూనే ఉన్నాడు.

*ఈ రెండిటిలో అర్థం చేసుకోడానికి ఏది సులువుగా ఉంది?*

*ఐనప్పటికి దాన్ని ఆదరించిన పాఠకులకి నేను కృతజ్ఞుడ్ని. వాక్యాదోషాలని పక్కన పెడితే, కొన్ని ముఖ్య సంఘటనలని 'మిసెస్ పరాంకుశం'లో రాయలేదు. పేలవంగా ఉన్న చోట పుష్టిని చేకూర్చి, మిస్ అయిన అలాంటి కొన్ని ముఖ్య సంఘటనలని ఈ పుస్తకంలో చేర్చాను. ఇందుకు దాదాపు నలభై ఏళ్ళ పాటు కొన్ని వేల కథలు, వ్యాసాలు, నూట పాతిక పైగా నవలలు, సినిమా కథలు రాసిన అనుభవం తోడ్పడింది. అందువల్ల ఇది పాఠకులని తేలిగ్గా చదివిస్తుంది.*

*<u>సినిమా</u>*

*మిసెస్ పరాంకుశం సీరియల్‌గా పూర్తి అవకుండానే దర్శకుడు శ్రీ పి. సాంబశివరావు (అర్థరాత్రి ఫేమ్) నుంచి నాకు ఓ ఉత్తరం అందింది. దాన్ని తను చలన చిత్రంగా తీయాలని అనుకుంటున్నానని రాసారాయన. అది రచయితగా నాకు ఎంతో థ్రిల్‌ని, ఆనందాన్ని ఇచ్చిన ఉత్తరం. ఆ సందర్భంగా ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు ద్వారకా హోటల్‌లో కలిసాను. తెలుగు సినిమాకి చెందిన ఓ వ్యక్తిని కలవడం అదే నాకు తొలి అనుభవం. ఆ పరిచయంతో మొదలైన మా స్నేహం ఈ రోజుకీ కొనసాగుతోంది.*

*దాదాపు అప్పుడే మరో దర్శకుడు శ్రీ వి మధుసూధనరావు కూడా దీన్ని చలనచిత్రంగా తీయాలని ఆసక్తిని చూపించారు. వారిని కూడా బ్లూ మూన్ హోటల్లో కలిసాను. వీరిద్దరిలో ఎవరూ దీన్ని చిత్రంగా తీయలేదు.*

*ఓ ప్రముఖ దర్శకుడు ఈ నవలని ప్రభలో సీరియల్‌గా వస్తున్నప్పుడే చదివారు. దాన్ని సినిమా తీయాలని ఆయన ధ్యేయం. రెండేళ్ళ క్రితం సినిమాగా తీయడానికి ఈ నవల రైట్స్‌ని తీసుకున్నారు. ఎప్పటికైనా దీన్ని సినిమా చేయాలని ఆయన కోరిక. నేను చెప్పిన పారితోషికానికి రెట్టింపు ఇచ్చి నన్ను ఆశ్చర్యపరిచారు. ఆయన అనుమతి లేదు కాబట్టి ఆయన పేరు చెప్పను.*

*'కౌముది' మీదనున్న ప్రత్యేక అభిమానంతో ఈ నవలని సీరియల్ గా వేసుకునేందుకు అనుమతించాను.*

*దాదాపు ముప్పై ఏడేళ్ళ క్రితం నాటి ఈ నవల మీకందరికీ నచ్చుతుందని ఆశిస్తూ,*

*హైదరాబాద్*

*మార్చి 4, 2009* *మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి*

## 1

**పరాంకుశం** సాయంత్రం ఆఫీసు నుంచి తిరిగి రాగానే తన గదిలో కూర్చుని పెన్సిల్‌తో గళ్ళ నుడికట్టుని నింపడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ రోజు రాత్రి వెళ్ళాల్సిన చోటుని, చెయ్యాల్సిన పనిని గురించి ఆలోచిస్తూ, నెమ్మదిగా గళ్ళ నుడికట్టు నింపుతున్నాడు.

ఎవరో వస్తున్న అలికిడిని విని తలెత్తి చూశాడు. పక్కింటి అమ్మాయి అమ్మాజీ.

"పోస్ట్‌మేన్ వచ్చాడా? కొంప తీసి నాకు ఉత్తరం వచ్చిందా?" నవ్వుతూ అడిగాడు పరాంకుశం.

"అవును. నన్ను సినిమాకి తీసుకెళితేనే ఇచ్చేది." కొంటెగా చూస్తూ చెప్పింది ఆ అమ్మాయి.

"తప్పకుండా. రేపు వెళదాం"

"ఆశ. ఇలా ఎన్ని రేపులు వెళ్ళిపోయాయో? మీకు ఉత్తరం వచ్చినప్పుడే అసలు నా సినిమా సంగతి మీకు గుర్తుకు వచ్చేది." గారంగా చెప్పింది అమ్మాజీ.

"ఇవ్వు, రేపు తీసుకెళతాలే."

"తప్పకుండా తీసుకెళ్ళాలి మరి."

"ఓ! వాడు తప్పకుండా తీసుకెళతాడు. మీరు వెళతారు."

అప్పుడే గదిలోకి అడుగు పెడుతున్న శ్రీకంఠం నవ్వుతూ చెప్పాడు.

"తీసుకెళ్ళరా అయితే?"

అనుమానంగా అడిగింది అమ్మాజీ.

"తప్పకుండా తీసుకెళతాను."

నమ్మకంగా చెప్పాడు పరాంకుశం  నవ్వుతూ.

"ముందర తీసుకెళ్ళమనండి. తరువాత పరాకు చిత్తగిస్తాడు పరాంకుశంగాడు. వాడి గురించి మీకు తెలియదు."

"నువ్వూరుకోవోయ్. ఊరికే పుల్లలు పెట్టకు." చిరుకోపంగా చెప్పాడు పరాంకుశం శ్రీకంఠంతో.

"ఈ మధ్య సంఘసేవ మొదలుపెట్టాడు లెండి. అందుకని పరాకుగా ఉన్నాడు."

ఆ అమ్మాయి సినిమా గురించి మరోసారి వాగ్దానం తీసుకుని ఉత్తరం అందించింది.

"సెకండ్ షోకి వెళ్ళి ఆలస్యంగా వస్తే ఈసారి తలుపు తీయనంతే." బెదిరించి వెళ్ళిపోయింది అమ్మాజీ.

కవరు చింపి కాగితం బయటకి తీసాడు పరాంకుశం.

"రాత్రికి వెళుతున్నావా?" అడిగాడు శ్రీకంఠం.

"వెళుతున్నాను."

జవాబు చెప్పాడు పరాంకుశం.

"అయితే మనసు మార్చుకోలేదన్నమాట."

"లేదు."

దృఢంగా చెప్పి ఉత్తరం చదవడంలో నిమగ్నుడయ్యాడు పరాంకుశం.

పరాంకుశం ఉత్తరం పూర్తిచేయగానే శ్రీకంఠం ఆసక్తిగా అడిగాడు పరాంకుశాన్ని.

"మామయ్య నుంచి, నువ్వే చదువు."

ఉత్తరం అందించాడు శ్రీకంఠానికి.

ఎక్సర్ సైజ్ కాగితం మీద గొలుసుకట్టు తెలుగులో రాసి ఉంది ఆ ఉత్తరం.

*పరాంకుశాన్ని మీ మామయ్య చిదంబరం దీర్ఘాయువుగా దీవించి వ్రాయునది,*

*నువ్వు పెద్దవాడివయ్యావు. నేరుగా నీకు చెప్పవలసింది ఏమీ లేదు. నీ కన్నీ తెలుసు. పట్టుదల మాని వచ్చే శనివారం సెలవు పెట్టి ఇక్కడకు రావలసింది. కొవ్వూరులో ఒక మంచి పిల్ల ఉంది. మన సంప్రదాయానికి అంతస్థుకి అన్ని విధాలా తగినది. జాతకాలు కూడా కలిసాయి. నువ్వు చూస్తే తరువాత మాట్లాడుకోవచ్చు పిల్ల పచ్చగా బావుంటుంది.*

*నీ పెళ్ళి చేస్తే మా బాధ్యత తీరుతుంది. తరువాత నీ ఇష్టం.*

*అత్తయ్య కులాసా. నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. అశ్రద్ధ చేయకుండా ఎప్పుడు వస్తున్నది వెంటనే సమాధానం వ్రాయి. ఉత్తరం పోస్ట్ చేయడం మర్చిపోవద్దు.*

ఇట్లు - నీ మామయ్య

దాన్ని చదివి టేబుల్ మీద పడేసి చెప్పాడు శ్రీకంఠం పరాంకుశంతో.

"నా మాట విని బుద్ధిగా వెళ్ళి ఆ అమ్మాయిని చూసి మెడలో మూడు ముళ్ళూ వేసి తెచ్చుకో."

"నా మనసు మార్చలేవోయ్. ఇవాళ రాత్రి వెళ్ళి అన్ని సంగతులూ మాట్లాడటానికే నిశ్చయించుకున్నాను."

"నీ జీవితంలో చాలా పెద్ద పొరపాటు చేస్తున్నావేమో అని అనిపిస్తోంది." కొద్ది క్షణాలాగి చెప్పాడు శ్రీకంఠం.

"కాదని కాలమే ఋజువు చేస్తుంది."

"ఆల్ రైట్. నీ ఇష్టం." చెప్పాడు శ్రీకంఠం చిన్నగా నిట్టూర్చి.

"నీకు తెలియనిది ఏముంది? నా జీవితంలో ఇదో పెద్ద ఛాలెంజ్. ఛాలెంజ్ లేకుండా అందరిలా చప్పగా జీవించడం నాకు చేతకాదు. దట్సిట్." చెప్పాడు పరాంకుశం.

సిగరెట్ వెలిగించాడు శ్రీకంఠం.

"పెళ్ళి మామూలుగా అందరిలా చేసుకోవాలనుకుంటే ఈ పాటికే ఇందాక వచ్చిన పక్కింటి అమ్మాయిని ఎప్పుడో చేసుకునేవాణ్ణి. నేనంటే ఇష్టపడుతుంది. అమ్మాజీ బాగుంటుంది కూడా."

"నిజంగా చాలా మంచిపిల్ల. ఆ పిల్లని చేసుకున్నవాళ్ళు ఎవరైనా సుఖపడతారు."

"అవును. వాళ్ళింట్లో అందరికీ సంస్కారం, విద్యా ఉన్నాయి. అలాంటివాళ్ళు తేలికగా నీలాంటి వాళ్ళ ద్వారా చెల్లుబడి అయిపోతారు."

పరాంకుశం కూడా సిగరెట్ వెలిగించాడు.

"ఎక్కడా ఏ సమాజంలోనూ నువ్వు చేసే పనిని ఎవరూ హర్షించరు. విజయం పొందలేరు కూడా. బాగా ఆలోచించుకో."

"నన్ను నిరుత్సాహ పరిచే బదులు ప్రోత్సహించవచ్చుగా?" సీరియస్‌గా చూస్తూ చెప్పాడు పరాంకుశం.

శ్రీకంఠం లేచి నిలబడి గుమ్మందాకా వెళ్ళి ఆగి నవ్వుతూ చెప్పాడు.

"నా అండదండలూ, సహాయం నీకెప్పుడూ సిద్ధమే."

✷✷✷

పరాంకుశం ఆ రాత్రి ఎనిమిదిన్నరకి రూంలోంచి బయటికి వచ్చాడు.

"హోటల్‌కా?"

ఎదురొచ్చిన అమ్మాజీ అడిగింది.

"మంచి శకునం."

నవ్వాడు పరాంకుశం.

"భోంచేసి త్వరగా రండి. రాత్రి తొమ్మిదిన్నర దాటితే తలుపు తెరవను. మీరు నన్నొక్కసారి సినిమాకి తీసుకెళ్ళితేగా నేను మీకు సహాయం చేయడానికి."

నిష్టూరంగా చెప్పింది అమ్మాజీ.

"ఇవ్వాళ మాత్రం కొంచెం ఆలస్యంగా వస్తాను."

"మళ్ళీ సినిమాకా?"

"అవును. పోనీ నువ్వూ వస్తావా?"

"మీ వెంట సెకండ్ షోకి మా ఇంట్లో నన్ను పంపరని మీకు తెలీదా?"

"సినిమాకి కాదులే. పదకొండవచ్చు." నవ్వాడు.

"ఇంత రాత్రి ఎక్కడికో రాచకార్యానికి?"

"వచ్చిన తరువాత చెబుతాగా."

"సరే. ఈ ఒక్క రాత్రికే తలుపు తీసేది."

"థాంక్స్."

"రేపు సినిమాకి తీసుకెళ్ళాలి. అక్కడ కోకోకోలా తాగించాలి. సరే అంటేనే రాత్రి తలుపు తీసేది."

"అలాగే"

"అలాగే కాదు. సరే అనండి."

"సరే."

మళ్ళీ నవ్వాడు పరాంకుశం.

ఎదురింటి తలుపు అకస్మాత్తుగా తెరుచుకుంది. ఓ నలభై యేళ్ళ అతను బయటికి వచ్చాడు. ఇద్దరివంకా కాసేపు తీక్షణంగా చూసి రోడ్డు మీదకి వేగంగా వెళ్ళిపోయాడు. ఓ ఇరవై యేళ్ళ యువతి వచ్చి తలుపు గడియ పెట్టుకుంది. ఏడ్చినట్లుగా ఆ యువతి మొహం ఉబ్బి ఉంది.

"పాపం మళ్ళీ కొట్టినట్లున్నాడు." చెప్పింది అమ్మాజీ పరాంకుశంతో.

"ఏమిటి?"

తన ఆలోచనలోంచి బయటపడి అడిగాడు పరాంకుశం.

"తలుపు వేయడానికి వచ్చినప్పుడు చూసాను. ఆ అమ్మాయి కళ్ళు ఎర్రబడి ఉన్నాయి. ఎదురింటాయన తన భార్యని మానసికంగానూ, శారీరకంగానూ చిత్రహింసలు పెడతాడు. పాపం, అన్నిటినీ భరించి ఆమె అలాగే పడి ఉంటోంది. బహుశా మంచి రోజు కోసం ఆశగా ఎదురు చూస్తోందనుకుంటాను."

"ఎదురింటివాళ్ళ గురించా నువ్వు చెప్పేది?" అడిగాడు పరాంకుశం.

"అవును. అనుమానపు మొగుడు దొరికితే జీవితం నరకంతో సమానం. నేనయితేనా...."

"ఏం చేసేదానివి?"

నవ్వుతూ అడిగాడు.

"పతి సేవే చేస్తూ, మంచి మార్పు కోసం ఎదురు చూస్తూ ఆ అమ్మాయిలా జీవచ్చవంలా పడి ఉండేదాన్ని కాదు. విడాకులు తీసుకుని స్వంత కాళ్ళ మీద నిలబడేదాన్ని."

"ఔన్నత్యాన్ని నువ్వు ఎప్పుడూ ప్రోత్సహిస్తావు కదూ?" అడిగాడు పరాంకుశం అకస్మాత్తుగా.

"అవును. నేనే కాదు. ఎవరైనా నా ఔన్నత్యాన్ని ప్రోత్సహిస్తారు. ఏం?" అడిగింది అమ్మాజి.

"నేనిప్పుడు వెళ్ళేది అలాంటి ఔన్నత్యాన్ని పొందడానికే." చెప్పాడు పరాంకుశం సిగరెట్ వెలిగించి.

"అంటే? ఎక్కడికి?"

ఆసక్తిగా అడిగింది అమ్మాజి.

"త్వరలో చెపుతాగా."

"ముందర నాకే చెప్పాలి.

"అలాగే."

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ కదిలాడు పరాంకుశం.

అమ్మాజీ వెళుతున్న పరాంకుశం వంక తృప్తిగా చూసింది. పరాంకుశం ఆ అమ్మాయి కళ్ళకి ఎప్పుడూ మాటల్లోనూ, చేష్టల్లోనూ హీరోలాగా, ఉన్నతుడుగా కనబడతాడు. అతన్ని భర్తగా పొందే అమ్మాయి పూర్వజన్మలో ఎన్నో వ్రతాలు చేసి, పెట్టి పుట్టి ఉంటుందని ఆ అమ్మాయి ఆలోచన.

ఎంత ప్రయత్నించినా తను పరాంకుశానికి చేరువ కాలేకపోతోందని కూడా అమ్మాజీకి తెలుసు.

చిన్నగా నిట్టూర్చి లోపలికి నడిచింది అమ్మాజీ.

పరాంకుశం హోటల్లో భోజనం చేసి సిగరెట్ వెలిగించి నెమ్మదిగా నడవసాగాడు.

అరగంట నడిచాక చీకటి పేటగా ప్రసిద్ధికెక్కిన ఆ పేటలోని ఒక సందుచివర ఆగాడు. ఒకసారి సందులోకి చూశాడు. బాగా చీకటిగా ఉంది. ఆ సందులోని వాళ్ళు స్ట్రీట్ లాంప్స్‌ని వెలగనివ్వరు. బద్దలు కొట్టేస్తారు. ఎప్పుడైనా కొత్త బల్బులని మునిసిపాలిటీవాళ్ళు అమర్చినా ఉంచరు. రెండూ రోజుల్లో పగల కొట్టేస్తారు. సందులోని వాళ్ళు కాల్చే సిగరెట్ చివర వెలిగే నిప్పు కనబడుతూ, ఆ సందులో మనుషులు తిరుగుతున్నారన్నది తెలుస్తోంది.

పరాంకుశం సిగరెట్ ఆఖరిసారిగా పీల్చి, సిగరెట్ పీకని నేలమీద పడేసి బూటు కాలితో ఆర్పేసాడు.

ధైర్యంగా ఆ సందులోకి అడుగులు వేసాడు. అది చాలా ఇరుకు సందు. ఆ సందులో జీవించేవారిలో ఎక్కువ మంది ఇరుకు మనసులు కలిగిన మనుషులే. దేన్నైనాడబ్బుతో కొలుస్తారు. డబ్బు వాళ్ళకి ప్రపంచం! డబ్బు వాళ్ళకి ప్రాణం! డబ్బు వాళ్ళకి ప్రామాణికం! డబ్బు వాళ్ళ జీవితం!

అలాంటి సందులు ఆ పేటలో చాలా ఉన్నాయి. ఆ పేటలోనే కాదు, అలాంటి సందులు, అలాంటి డబ్బాశ గల మనుషులు అనేక ఊళ్ళలో, రాష్ట్రాల్లో, దేశాల్లో ప్రపంచం అంతటా నిండి ఉన్నారు.

ఆ సందులోని వాళ్ళ వ్యాపారులు. వెలలేని శీలాన్ని, తుచ్ఛమైన సుఖాన్ని, కాలం పెంచిన శరీరాన్ని వెలకట్టి వ్యాపారం చేస్తారు. సుఖాన్ని తాత్కాలికంగా కొనుక్కోవడానికి ఆ సందులోకి వెళ్ళేవాళ్ళంతా తాము రసికులం అనుకుంటారు. వ్యాపారం చేసేవాళ్ళు తమది ఖర్చు కాని, తరగని సరుకని, లాభసాటి వ్యాపారం అని అనుకుంటారు. రాత్రిళ్ళు ఆ సందు రద్దీగా, హడావిడిగా ఉంటుంది.

ఆ సందులో సుఖాలే కావు. రోగాలు, పాపాలు, ద్వేషాలు, కొట్లాటలు, పగలు - ఇంకా చాలా ఉన్నాయి. పుణ్యం, పాపం అన్న పదాలు ఆ సందులోని భాషకి బయటి పదాలు.

అలాంటి సందులోకి వెళ్ళాడు పరాంకుశం. చీకట్లో సందుకి రెండువైపులా ఉన్న ఇళ్ళని చూసుకుంటూ ఓ ఇంటి ముందికి వెళ్ళి నిలబడ్డాడు.

వివిధ వయసుల్లో ఉన్న అమ్మాయిలు, ఆవిడలు పరాంకుశాన్ని చేయెత్తి పిలుస్తున్నారు.

పరాంకుశం సందు మధ్యలో ఒక ఇంటి ముందు ఆగాడు.

"రా మావఁ, నా కాడికి."

ఓ ముప్పై అయిదేళ్ళ యువతి గారంగా అంటూ, ఒయ్యారం ఒలకపోస్తూ పరాంకుశాన్ని రాసుకుంటూ ముందుకు వెళ్ళింది.

పరాంకుశం తను కూర్చున్న ఇంటి ముందు ఆగడం గమనించి, ఆ ఇంటి ముందు చుట్ట తాగుతూ గొంతుక్కి కూర్చుని ఉన్న ఓ గళ్ళ లుంగీ అతను చెప్పాడు.

"రండి సార్. పసందైన వాళ్ళున్నారు."

పరాంకుశం జేబులోంచి సిగరెట్ పెట్టె తెరిచి, కొత్త సిగరెట్ వెలిగించుకుని ఆ ఇంట్లోకి నడిచాడు. గుండెలో వణుకు.

లోపల ఒక కుంటి కాలువాడు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. పక్కనే ఒక చెక్క బల్ల ఖాళీగా ఉంది. దానిమీద ఓ మధ్య

వయస్కుడు కూర్చుని ఉన్నాడు. ఆ గదిలో ఒక మూల పెట్రోమాక్స్ లైటు వెలుగుతోంది. పరాంకుశం వెనకాలే వచ్చాడు ఆ గళ్ళ లుంగీ అతను.

నాలుగైదు పేర్లు పెట్టి పిలిచాడు ఆ కుంటతను. తలుపులు తెరుచుకుని నలుగురు అమ్మాయిలు ఆ గదిలోకి వచ్చారు. అర్ధనగ్నంగా ఉన్న బట్టలతో, కులుకుతూ, వారంతా వరసగా నుంచుని పరాంకుశం వంక ఏ మాత్రం ఆసక్తి లేకుండా చూడసాగారు. పాతిక నుంచి నలభై దాకా ఉంటాయి వారి వయసులు. చాలామంది మొహాల్లో ఓ విధమైన విసుగు కూడా తొంగి చూస్తోంది.

"వీళ్ళు కాదు." గొణిగాడు పరాంకుశం.

"నిన్న మీకు చూపించిన పిల్లా?" కుంటతను పరాంకుశం వంక ఎగాదిగా చూసి నవ్వుతూ అడిగాడు.

అవునన్నట్లుగా తల ఊపాడు పరాంకుశం.

"లోపల ఇంకో పేసెంజర్ ఉన్నాడు. ఇంకో పావుగంటలో పనవగానే వస్తాడు. కూర్చోండి."

కూర్చోమన్నట్లుగా బల్లవైపు చూపించాడు కుంటతను.

పరాంకుశం ఆ చెక్క బల్ల మీద ముందరే కూర్చునున్న ఒకతని పక్కన కూర్చున్నాడు. పరాంకుశం వంక కొద్దిగా ఇబ్బందిగా చూస్తూ దూరంగా జరిగాడతను.

కుంటతను సంజ్ఞ చేయగానే. ఆ నలుగురు అమ్మాయిలూ లోపలికి వెళ్ళిపోయారు.

అప్పుడప్పుడూ వినపడే సందులోని వాళ్ళ మాటలు తప్ప, అక్కడి వాతావరణం ప్రశాంతంగా ఉంది. పరాంకుశం ఎదురు గోడవంక చూస్తూ కూర్చున్నాడు.

ఇరవై నిమిషాల తరువాత తలుపు కిర్రు మంటూ తెరచుకున్న చప్పుడు వినిపించింది. లోపలనుంచి ఒకతను బయటికి వచ్చాడు. రైతులాగా ఉన్నాడు. పంచె, లాల్చీ, కండువాలతో మోతుబరి రైతులా కనిపించే అతనికి ఏభై పైనే ఉంటాయి.

"నీళ్ళ గది ఎక్కడ?" అడిగాడతను కుంటతన్ని.

కుంటతను అతనికి సమాధానం చెప్పకుండా పరాంకుశం పక్కన కూర్చున్నతనికి ఏదో సైగ చేసాడు. లోపలికి వెళ్ళడానికి అతను లేచాడు. పరాంకుశం అతని చెయ్యి పట్టుకుని ఆపి చెప్పాడు.

"పది నిమిషాల్లో వచ్చేస్తాను. ఉండు."

కుంటతను చటుక్కున లేచి పరాంకుశాన్ని గట్టిగా పట్టుకుని చెప్పాడు.

"ఆయన నీకన్నా ముందొచ్చాడు. ఆగు."

"నేను రైలుకి వెళ్ళాలి."

అని, ఆ మధ్య వయస్కుడు లేచి గబగబా లోపలికి నడిచాడు. మళ్ళీ తలుపు కిర్రు మంటూ మూసుకున్న చప్పుడు. పరాంకుశానికి ఆ వాతావరణం నచ్చక ఎంత త్వరగా బయట పడితే అంత మంచిదని చూస్తున్నాడు. అతను సరిగ్గా పది నిముషాల్లో బయటకి వచ్చేసాడు. రాబోయే ముందు అందుకు గుర్తుగా తలుపు కిర్రుమన్న శబ్దం వినిపించింది.

ఈ లోగా పరాంకుశం దగ్గర డబ్బు తీసుకున్న కుంటతను అతన్ని లోపలికి వెళ్ళమని సైగ చేసాడు. చేతిలోని సిగరెట్‌ని పారేసి అతను వచ్చిన గదిలోకి వెళ్ళి తలుపు మూస్తుంటే మళ్ళీ అదే శబ్దం. పరాంకుశం లోపల గడియపెట్టి గుమ్మం దగ్గరే నిలబడి చూసాడు.

"ఓ! నిన్నటి కుర్రాడివా?"

గది మధ్య మంచం మీద పడుకుని ఉన్న ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి పరాంకుశాన్ని చూసి నవ్వి చెప్పింది.

"అవును."

"దా.."

అతని కాళ్ళు స్వల్పంగా వణికాయి. దాన్ని ఆమె గమనించింది. మంచం వైపు నడిచాడు పరాంకుశం.

"నిన్నటిలాగే ఈ రోజు కూడా వృధాయేనా? కాస్త కులాసా చేసేదేమైనా ఉందా?"

వెకలిగా నవ్వి, పక్కన పడుకోమన్నట్లుగా చేత్తో తట్టింది.

"సౌదామినీ." పిలిచాడు పరాంకుశం.

"ఇక్కడే ఉన్నాను."

ఒళ్ళు విరుచుకుంది సౌదామిని.

"నిన్న నేను చెప్పిన దాని గురించి ఆలోచించావా?" అడిగాడు.

"మళ్ళీ అదే గోలా? ఎక్కడ తగలడ్డావు నా ప్రాణానికి?"

విసుగ్గా చెప్పింది పైటతో మొహం విసురుకుంటూ.

"నీ కిక్కడే బాగుందా?" అడిగాడు పరాంకుశం.

"బాగున్నా, బాగోలేకపోయినా నీతో లేచి రాను. అంతే." కోపంగా చెప్పింది సౌదామిని గుడ్లురిమి చూస్తూ.

"లేచి రమ్మంటం లేదు. పెళ్ళి చేసుకుందామంటున్నాను."

"ఏం చేసుకుందామనుకుంటున్నావు?" పక పక నవ్వి అడిగింది.

"పెళ్ళి."

"మళ్ళీ చెప్పు?"

"పెళ్ళి."

"అంటే?"

"అంటే.... మనిద్దరం ఒకరి కొకరు."

పగలబడి నవ్వింది సౌదామిని.

చెప్పడం మధ్యలో ఆపేసాడు పరాంకుశం. మంచం మీద దొర్లుతూ పగలబడి నవ్వుతూనే ఉంది సౌదామిని కొద్ది నిముషాలసేపు.

ఆమె నవ్వు పూర్తయ్యేదాకా ఆమె వంక నిశ్శబ్దంగా చూస్తుండిపోయాడు పరాంకుశం.

"దేనికి నవ్వుతావు?" అడిగాడు పరాంకుశం తర్వాత.

సమాధానం చెప్పకుండా మళ్ళీ నవ్వింది సౌదామిని.

"ఏమిటి నీకు అంత నవ్వు తెప్పించేది?" చిరాగ్గా అడిగాడు పరాంకుశం.

"పెళ్ళి."

నవ్వు ఆపుకుని, అదేదో వింతదయినట్లుగా సౌదామిని వత్తి పలుకుతూ అన్నది.

"అవును. పెళ్ళే."

"నన్ను పెళ్ళి చేసుకుంటావా? ఎవరయినా డాక్టర్ దగ్గరకి వెళ్ళి చూపించుకో ముందు."

"దేనికి?"

"నీకు పిచ్చి కనుక. విశాఖపట్నంలో ఓ ఆస్పత్రి ఉంది.. హైదరాబాదులో కూడా ఉందట."

"సౌదామినీ."

సౌదామిని చేతిని పట్టుకుని ఆమె కళ్ళలోకి చూస్తూ చెప్పాడు పరాంకుశం,

"నాకే పిచ్చి పట్టలేదు. నువ్వు ఒప్పుకుంటే నిన్ను నిజంగా పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నాను తెలుసా."

"దేనికి? బైట మంచి వాళ్ళెవరూ దొరకలేదా? బాగానే ఉన్నావుగా ఎర్రగా, బుర్రగా,"

"మంచి వాళ్ళు దొరకక కాదు. ఈ చెడ్డ దారిలోంచి నిన్ను బైటకి లాగలని."

"ఓయబ్బో, వచ్చాడు మా మంచి..."

సౌదామిని వాక్యం పూర్తి చేయగానే పరాంకుశానికి చురుక్కుమంది.

"నిజంగానే చేసుకో. అబద్ధంగా వద్దులే."

పరాంకుశం భుజాల చుట్టూ చేతులు వేసి మోటుగా దగ్గరికి లాక్కుంది.

"ఉండు. నేను వచ్చింది దీని కోసం కాదు."

విదిలించుకున్నాడు.

"ఆట ఆడవా మరి?"

కళ్ళు ఆర్పి అడిగింది.

"నాతో వచ్చేయ్ నువ్వు."

"రోజూ రాత్రి ఫ్రీగా ఛాన్స్ కొట్టేయ్యచ్చనా?"

"షటప్"

మళ్ళీ నవ్వింది.

"ఇంగ్లీషు వచ్చు కామోసు."

బుగ్గ కింద చెయ్యి పెట్టుకుని చిన్నపిల్లలాగా చూసింది.

"ఇక్కడ ఉంటే నీ ఒళ్ళు, యవ్వనం, మనసు ఇంకా పాడైపోతాయి. నన్ను పెళ్ళి చేసుకుంటే నీకే బాధా ఉండదు. హాయిగా కాపురం చెయ్యొచ్చు. పిల్లలు పుడతారు. పేరంటాలకి వెళ్ళొచ్చు. అందరిలా బతకొచ్చు."

"ఇంకా?"

వ్యంగ్యంగా అడిగింది.

పరాంకుశం మొహంలో ఆమెకి అసహనం కనపడింది. కాని అతను వెంటనే తన మొహాన్ని పక్కకి తిప్పుకున్నాడు.

"నీ పేరేమిటన్నావ్?" అడిగింది సౌదామిని, కోపంతో మరోవైపు చూస్తున్న పరాంకుశాన్ని.

"ఏం?" అడిగాడు విసురుగా.

"ఓ పిచ్చోడి పేరు ఎలా ఉంటుందో విందామని. చెప్పు."

జవాబు చెప్పలేదు అతను. ఆలోచిస్తున్నాడు.

"చెప్పమంటూంటే."

"పరాంకుశం."

"చూడు పరాంకుశం. నీకేమైనా డిఫెక్ట్స్ ఉన్నాయా?"

"అంటే?"

"లేకపోతే అందరిలా ఆటాడకుండా ఇలా ఊరికే ఇలా చూస్తూ కూర్చుంటావా? నీకేదో లోపం ఉందిలే. నాకు తెలుసు."

కుర్రాడైన పరాంకుశం మగతనం మీద ఛెళ్ళున తగిలాయి ఆ హేళనతో కూడిన మాటలు.

"ఛీ. ఏం ఆలోచనలు నీవి."

సౌదామిని మళ్ళీ పక పక నవ్వింది. ఆ నవ్వులో కల్మషం లేదు.

బలంగా లాక్కున్నాడు సౌదామినిని మీదకి. తన కౌగిలిలోంచి అరంగుళం అయినా కదలకుండా బంధించి పక్క మీద బలంగా అదిమి పట్టుకున్నాడు ఆమె శరీరాన్ని.

అయిదు నిముషాల తరువాత సౌదామిని పక్కనే పడుకుని సిగరెట్ తాగుతూ, సీలింగ్ వంక చూస్తూ సేద తీర్చుకున్నాడు పరాంకుశం.

ఛ! తను వచ్చింది దేనికి? చేసింది ఏమిటి? ఎందుకిలా వివశుడయిపోయాడు? తన తప్పా? సౌదామిని తప్పా?

పరాంకుశం చేతిలో సిగరెట్ అందుకుని, నోట్లో పెట్టుకుని గుండెలదాకా పొగ పీల్చింది సౌదామిని.

"సిగరెట్ తాగుతావా నువ్వు?"

అడిగాడు పరాంకుశం ఆశ్చర్యంగా.

"అవును. ఏం?"

పరాంకుశానికి ఏం మాట్లాడాలో తెలియలేదు.

"జోక్ చేస్తున్నావా నాతో పెళ్ళని?" అడిగింది సౌదామిని.

"జోక్ కాదు. నిజం నీతోడు."

సౌదామిని పక్కకు ఒత్తిగిల్లి సిగరెట్ పొగ పరాంకుశం మీదకి వదులుతూ అడిగింది.

"నన్ను పెళ్ళి చేసుకుని బాగుపడదామనా?"

"నిన్ను బాగు చేద్దామని."

"కాదు. నాకు తెలుసు. నువ్వు బాగుపడదామని."

"ఎలా బాగుపడతాను?"

"నీ పెళ్ళాంగా అందరికీ పరిచయం చేసి, డబ్బు సంపాదించవచ్చని కదూ? నాకు తెలుసులే."

"శివ శివా. నీకు ఎలా వస్తాయి ఇలాంటి ఆలోచనలు?"

పరాంకుశం కళ్ళలోకి చూసింది సౌదామిని. సౌదామినికి పాతికేళ్ళ పరాంకుశం కళ్ళల్లో వెదికి చూసినా ఎలాంటి కల్మషం కనబడలేదు. ఆ గదిలోకి వచ్చే అందరిలో కనపడనిది ఏదో కొత్తది కనబడింది. సౌదామిని ఆ 'ఏదో'కి 'మంచితనం' అనే పేరు ఎప్పుడో పెట్టుకుంది.

"నాకు తెలుసులే. నీకు అంత ధైర్యం కూడానా?"

పరాంకుశం లేస్తుంటే లేవనీయకుండా మీదికి ఒరిగి అన్నది.

"ఇంకాస్సేపు ఉండు."

పరాంకుశం సౌదామినిని తప్పించుకుని మంచం దిగి దుస్తులు వేసుకుని తలుపు వైపు నడిచాడు.

"మళ్ళీ రేపు వస్తావా?" అడిగింది.

"దేనికి ఇంక?" చొక్కా బటన్స్ పెట్టుకుంటూ అడిగాడు.

"దేనికో దానికి. రేపు రా చెపుతాను."

"ఇక రాను."

"ఉండు."

తలుపు గడియ మీద చెయ్యి వేసాడు. అది గమనించిన సౌదామిని కిందకి దిగి పరుగెత్తుకు వచ్చి పరాంకుశం మీద పడింది.

దూరంగా నెట్టాడు సౌదామినిని. ఆమె వదలలేదు. కదలకుండా పట్టుకుంది పరాంకుశాన్ని.

"వదులు".

విదిలించుకున్నా సౌదామిని అలాగే ఉండిపోయింది వదలకుండా.

ఈడ్చి చెంప మీద కొట్టాడు పరాంకుశం.

"అబ్బా!"

చెంప మీద చెయ్యేసుకుంది సౌదామిని, ఈ సారి వదిలింది.

"పెళ్ళికి ఒప్పుకుంటే చెప్పు. లేకపోతే లేదు."

"ఇక్కడికి వచ్చిన వాళ్ళల్లో సగం మంది నన్ను పెళ్ళిచేసుకోమంటారు తెలుసా?"

"ఇక్కడికి వచ్చేవాళ్ళు ఎందుకోసం వస్తారో నేను అందుకోసం రాలేదు. నిజంగా పెళ్ళి కోసమే వచ్చాను."

"ఐతే రేపు రాత్రికి రా. ఏ సంగతీ చెపుతాను."

"సరే అయితే."

"నీ ఉంగరాల జుట్టు బావుంది."

తలుపు గడియ తెరిచాడు పరాంకుశం.

"రేపు తప్పకుండా రావాలబ్బాయ్."

సౌదామిని ఆశగా చూసింది పరాంకుశం కళ్ళలోకి.

"అలాగే. తప్పకుండా వస్తాను."

తలుపు తెరిచాడు.

"ఆ కుంటి వెధవ ఊరుకోడు గాని, లేకపోతే అసలు డబ్బులు ఇవ్వకపోయినా ఫర్వాలేదు నువ్వు."

"కుంటితనాన్ని అవహేళన చెయ్యకు. అది కావాలని అతను తీసుకోలేదు. అతనిలోని చెడ్డతనాన్ని మాత్రమే తిట్టు." చెప్పాడు పరాంకుశం.

పరాంకుశం బుగ్గ మీద చిటికె వేసి చెప్పింది సౌదామిని.

"మరే."

✷✷✷

## తరువాత కథ వచ్చేనెల .!!! ఎదురు చూడండి..!!!